

రోడ్డు దాటే ఆరాటం..

రుద్రారం - నాగసమందర్ గ్రామాల మధ్య లో లెవల్ వంతెన దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



పాపం.. పత్తి రైతు

అధిక వర్షాల కారణంగా వందల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. 8లో▸



గెలుపే లక్ష్యం

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. 9లో▸

టెండర్ వేద్దామా.. వద్దా..?



వికారాబాద్ పట్టణంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం

డైలమాలో మద్యం వ్యాపారులు

- లైసెన్స్ దరఖాస్తు ఫీజు పెరగడంతో అయోమయం
- 12 రోజుల్లో వచ్చింది 2 దరఖాస్తులే
- మిగిలింది మరో పది రోజులు

వికారాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ఖరారు చేసిన నేపథ్యంలో వ్యాపారులు టెండర్ వేయాలా.. వద్దా..? అనే డైలమాలో పడిపోయారు. దరఖాస్తు ఫీజు భారీగా పెంచడంతో ఈ పరిస్థితి నెల కొన్నట్లు తెలిసింది. 2023 - 24 సంవత్సరానికి గాను టెండర్లు వేసిన చాలా మంది నష్టాలు చవిచూశారు. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలకు పెంచింది. దీంతో ముందుకు వెళ్లాలా వద్దా అనే ఆలోచనలో పడ్డారు. రెండేళ్ల క్రితం వరకు వైన్ షాపులు దక్కించుకున్న వారు లాభాలు ఆర్జించడంతో 2023 ఆగస్టులో నిర్వహించిన టెండర్లలో రెగ్యులర్ వ్యాపారులే కాకుండా సాధారణ ప్రజలు, ఉద్యోగులు సైతం పాల్గొన్నారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2023లో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. 2,500 మంది టెండర్లు వేశారు. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది డిసెంబర్‌తో గడువు ముగుస్తుండగా ప్రభుత్వం మూడు నెలల ముందే టెండర్లు ఆహ్వానించింది. గత నెల 26 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 18వ తేదీతో గడువు ముగియనుంది. ప్రక్రియ ప్రారంభమై 12 రోజులు గడిచినా ఇప్పటి వరకు కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

వేచి చూసే ధోరణిలో..

గతేడాది అత్యధిక అమ్మకాలు జరిపిన బెల్టు షాపులను గుర్తించి కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. రెండేళ్లతో పోలిస్తే అమ్మకాలు గణనీయంగా పెరిగినప్పటికీ షాపుల సంఖ్య పెంచలేదు. అధికారులకు మద్యం వ్యాపారులతో ఉన్న లోపాయికారి ఒప్పందాల వల్లే దుకాణాల సంఖ్య పెంచలేదనే విమర్శలు ఉన్నాయి. లక్కీ డ్రా పద్ధతిన దుకాణాల ఎంపిక చేయనున్న నేపథ్యంలో ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో మొత్తం 59 వైన్స్ ఉండగా ఇప్పటి వరకు కేవలం రెండు దరఖాస్తులే వచ్చాయి. గతేడాది నష్టాలు రావడంతో వేచి చూసే ధోరణిలో ఉన్నారు.

సిండికేట్‌కే మొగ్గు

వ్యాపారులు వ్యక్తిగతంగా కాకుండా సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేసేందుకే మొగ్గు చూపుతున్నారు.గతంలో చాలా చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి కుటుంబసభ్యుల పేరిట దరఖాస్తులు వేశారు. మహిళలు సైతం చాలా మంది పాల్గొన్నారు.జిల్లాలో 15 నుంచి 20 దుకాణాల్లో అమ్మకాలు భారీగా ఉండటంతో వాటికి పోటీ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. పలుకుబడి ఉన్న కొందరు వారు ఎంచుకున్న షాపులకు ఇతరులు పోటీ రాకుండా ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.2023లో పరిగి కేంద్రంగా ఎక్కువ సింటికేట్లు ఏర్పడ్డాయి. ఒక్కో గ్రూపులో 100 మంది నుంచి 1,000 మంది సభ్యులు ఉండటం గమనార్హం. వీరు మూడు నుంచి ఐదు జిల్లాల పరిధిలోని దుకాణాలకు టెండర్లు వేశారు. టెండర్ డబ్బు నష్టపోకుండా ఉండేందుకు ఇలా వ్యవహరించినట్లు తెలిసింది. ఏ ఒక్కరికి దుకాణం వచ్చినా సభ్యులందరూ భాగస్వాములు కావచ్చనే ఉద్దేశంతో ఇలా వ్యవహరించారు. ఈ సారి కూడా ఇద్దే పద్ధతి అవలంబించే అవకాశం లేకపోలేదు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: వాల్మీకి మహర్షి దేశానికి ఆదర్శప్రాయమైన కవి, ఆధ్యాత్మిక గురువుగా నిలిచారని, ప్రతి ఒక్కరూ ఆయన్న ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రామాయణాన్ని రచించి సత్యం, ధర్మం, న్యాయం, సేవ వంటి విలువలను సమాజానికి చాటి చెప్పారన్నారు. అనంతరం కొమురంభీం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగీలాల్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి మధవరెడ్డి, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో..

ఎస్పీ కార్యాలయంలో..

వికారాబాద్ పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ నారాయణరెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు చేసుకోండి

- సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు
- జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం



వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న రాజరత్నం తదితరులు

పూడూరు: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 5.5 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేయగా అందులో ఎక్కువ శాతం(2.55 లక్షల ఎకరాల్లో) పత్తి పంట వేశారని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,262 రైతులకు సంబంధించి 7,506 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నమోదయ్యాయని తెలిపారు. పూడూరు మండలంలో 450 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పంట నష్టం వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ వివరాలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని, అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం సబ్సిడీ, ఇతరులకు 40శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ట్రాక్టర్‌కు సంబంధించిన పనిముట్లు, మందు స్ప్రేయర్లు, వరి గడ్డి చుట్టలు కట్టే యంత్రం అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు విధిగా పంట మార్పిడి పద్ధతి పాటించాలన్నారు. వాణిజ్య పంటలు కాకుండా సాధారణ పంటలు వేసుకోవాలని తెలిపారు. వాణిజ్య పంటలు సాగు చేయడం వల్ల పెట్టుబడుల భారం ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో నష్టాలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తులసీరాం, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శివ, రాజ్‌కుమార్, రైతులు యాదయ్య, క్రాంతి, తిరుమలయ్య, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సంఘటితం కావాలి

- కాంగ్రెస్ భూములను అమ్ముకొని బతకాలని చూస్తోంది
- ముఖ్యమంత్రి సిగ్గుతో తలదించుకోవాలి
- ట్రిపుల్ ఆర్ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

నవాబుపేట: పిల్లలపై తల్లిదండ్రులకు ఎంత మమకారం ఉంటుందో.. రైతులకు భూమిపై అంతకన్నా ఎక్కువ మమకారం ఉంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడిచి పెట్టిన విషయం తెలిసిందే. వారిని మంగళవారం చిట్టిగిద్ద గ్రామంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు భూమిని నమ్ముకొని బతుకుతుంటే కాంగ్రెస్ అన్నదాతల భూములను అమ్ముకొని ప్రభుత్వాన్ని నడపాలని చూస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో రైతులకు మోసం జరుగుతుంటే స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ విషయంలో సీఎం తలదించుకోవాలన్నారు. అభివృద్ధిని తాము వ్యతిరేకించడం లేదని, రైతులకు సరైన మేలు చేయాలన్నదే మా ఉద్దేశం అన్నారు. ట్రిపుల్ ఆర్ బాధితులకు భూమికి బదులు భూమి.. లేదా మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. మీకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతులు తిరగబడితేనే వారికి సరైన న్యాయం జరిగిందని గుర్తు చేశారు. అదే తరహాలో పోరాటం చేయాలన్నారు. పేదలను ముంచి.. పెద్దలకు లాభం చేకూర్చాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చిందని ఆరోపించారు. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, నాగేందర్‌గౌడ్, శుభప్రద పటేల్, ఆంజనేయులు, భరత్ రెడ్డి, దయాకర్ రెడ్డి, విజయ్ కుమార్, మాణిక్ రెడ్డి, కృష్ణారెడ్డి, శాంత కుమార్, నరేందర్ రెడ్డి, రాజు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు

డాక్టరేట్ సాధించిన గిరిపుత్రుడు



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న విఠల్ రాథోడ్

తాండూరు టౌన్: కృషి ఉంటే మనుషులు రుషులవుతారని నిరూపించాడు ఓ గిరిపుత్రుడు. పేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదివి డాక్టరేట్ సాధించాడు బషీరాబాద్ మండల కేంద్రానికి చెందిన విఠల్ రాథోడ్. తల్లి నాగిబాయి, తండ్రి రాము నాయక్ ద్వితీయ పుత్రుడైన విఠల్ రాథోడ్ చిన్ననాటి నుంచి చదువుపై ఎంతో ఆసక్తి కనపరిచేవాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయినా, పట్టుదలతో చదివి ఏకంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డి పట్టా సాధించాడు. పేదరికం ఉన్నత చదువులకు అడ్డంకి కాదని నిరూపించాడు. ఎంఏ ఇంగ్లిష్, ఎంఈడీ పూర్తి చేసిన ఆయన, 2020లో హెసీయూ నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ చాటి అడ్మిషన్ సాధించాడు. హెచ్‌సీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గీతా గోపీనాథ్ పర్యవేక్షణలో ×స్వదేశీ విద్యార్థుల జీవన నైపుణ్యాలు, నియంత్రణ స్థితికి సంబంధించి ద్వితీయ స్థాయిలో మానసిక సామాజిక సామర్థ్యం౯ అనే అంశంపై ఐదేళ్ల పాటు పరిశోధన చేసి 2024లో థీసిస్ సమర్పించారు. అతని పరిశోధనకు గాను మంగళవారం హైదరాబాద్‌లో హెచ్‌సీయూ వైస్ చాన్సలర్ బీజే రావు చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న విఠల్ రాథోడ్ దేశంలోనే అత్యంత కఠిన పరీక్షల్లో ఒకటైన యూజీసీ నెట్‌లో అర్హత సాధించి రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్‌కు ఎంపికై నెలకు రూ. 53వేల పారితోషకాన్ని ఐదేళ్ల పాటు తీసుకున్నారు. అలాగే జనవరి 2023లో దక్షిణాఫ్రికా రాజధాని కేప్ టౌన్‌లో బ్లెండెడ్ లర్నింగ్, ప్రతిభావంతమైన అభ్యాసానికి ఒక హైబ్రిడ్ బోధనా నమూనా అనే అంశంపై ప్రెజెంటేషన్ ఇచ్చి పత్ర సమర్పణ చేయడం విశేషం. డాక్టరేట్ సాధించిన విఠల్ రాథోడ్‌ను గ్రామస్తులు, సహచరులు, కుటుంబ సభ్యులు అభినందనలతో ముంచెత్తారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే



హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి బయటకు వస్తున్న శివకుమార్, ఆర్ కృష్ణయ్య

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్

దుద్యాల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మండల పరిధిలోని లగచర్ల గ్రామానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్ మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి పిటిషన్ నంబర్ 30217ను వేసినట్లు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ఇతర సామాజికవర్గాలు చేస్తున్న ప్రయత్నాలు సరి కాదని హితవు పలికారు.



తాండూరు టౌన్: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



పరిగి పట్టణంలో ప్రజా సంఘాల నిరసన

విధులు బహిష్కరించి నిరసన

సీజేపై దాడి యత్నం దారుణం

- నిందితుడిపై చర్యలు తీసుకోవాలి
- న్యాయవాదుల డిమాండ్
- అన్ని కోర్టుల్లో నిరసన కార్యక్రమాలు

అనంతగిరి/తాండూరు టౌన్/కొడంగల్/పరిగి: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది తీరును నిరశిస్తూ జిల్లాలోని అన్ని కోర్టుల్లో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. న్యాయవాది వృత్తిలో ఉన్న వ్యక్తి.. చీఫ్ జస్టిస్‌పై దాడికి యత్నించడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అతనిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, కొడంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బస్వరాజు, న్యాయవాదులు ఆనంద్, వెంకటయ్యగౌడ్, కె.రాములు, బి.కృష్ణయ్య, కె.రమేష్, భానుప్రసాద్, న్యాయవాది గోపాల్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న సెక్యులర్ వాదులు



కొడంగల్‌లో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



అనంతగిరి: విధులు బహిష్కరించిన న్యాయవాదులు

న్యూస్‌రీల్

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈఓ రేణుకాదేవి



శిక్షణ కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి

పరిగి: పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. మంగళవారం పరిగి పట్టణంలో నియోజకవర్గంలోని ఎంఈఓలు, జీహెచ్‌ఎంలు, ఎఫ్ఎల్ఎన్ మెంటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకొని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఈఓలు గోపాల్, వెంకటయ్య, రాంచంద్రయ్య, హబీబ్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లోనే కొనసాగించాలి

- మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు తరలించొద్దు
- ఉపాధ్యాయ సంఘాల విన్నపం



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్: కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాలను,ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను పట్టణంలోనే కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరారు. మంగళవారం పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామ శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు గతంలో జిల్లా ఉన్నతాధికారులు భూమిపూజ చేశారని గుర్తు చేశారు. మండలంలోని ఎరన్‌పల్లి గ్రామ శివారులో మెడికల్ కళాశాల నిర్మాణానికి అక్కడి రైతుల నుంచి భూమి సేకరించారని తెలిపారు. ఇంత చేసిన తర్వాత ఈ భవనాలను లగచర్లకు తరలిస్తున్నారని ప్రచారం జరుగుతోందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బుధవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాకంచర్ల శ్రీ లక్ష్మీకాంతారావు బాబా ఆరాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబా సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆత్మా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు వెంకట్‌రెడ్డి, రఘునాథ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల శుభ్రతకు కృషి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



స్వచ్ఛ ట్రక్కులను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేలా జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ కృషి చేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని మండలాలకు విస్తరించడం లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు కొత్త స్వచ్ఛ ట్రక్కులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని 11 మండలాల్లో 11 స్వచ్ఛ ట్రక్కులు పనిచేస్తున్నాయని తెలిపారు. అదనంగా ఐదు ట్రక్కులు చేరాయని తెలిపారు. వీటి ద్వారా 330 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రేపటినుంచి జోనల్ లెవల్ కబడ్డీ పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 9 నుంచి జరిగే 69వ హయత్‌నగర్ జోనల్ లెవల్ కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. పాఠశాల ఆవరణలో మంగళవారం జోనల్ పరిధిలోని పాఠశాలల క్రీడా ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు జోనల్ నుంచి బలమైన, నైపుణ్యం గల క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల ప్రారంభోత్సవానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ హాజరు కానున్నట్లు చెప్పారు. అండర్‌-14 బాలురు, బాలికలు, అండర్ -17 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు.

10న డివిజనల్ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మొయినాబాద్: 69వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా డివిజనల్ స్థాయి పోటీలకు ఈ నెల 10న క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు మండల విద్యాధికారి మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్‌-14, అండర్‌-17 విభాగాల్లో ఖోఖో కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అండర్‌-14 పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2012 జనవరి 1 లోపు, అండర్‌-17 పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2009 జనవరి 1 లోపు జన్మించి ఉండాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్ తీసుకుని 10వ తేదీ ఉదయం 9 గంటల వరకు అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 80744 82273, 92462 12488 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ (డిగ్రీ) మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎంఎస్సీలో అడ్మిషన్ పొందాలనేకునే విద్యార్థినులు ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బీపీసీలో కనీసం 40శాతం మార్కులు సాధించి ఉండాలని సూచించారు. 38 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఎస్టీలకు 33, ఎస్సీలకు 1, ఓసీలకు 1, అనాథ (ఆర్ఫాన్)లకు 1, స్పోర్ట్స్ కోటా 1, వికలాంగుల కోటా కింద 1 సీటు ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకునే వారు ఈనెల 15 వరకు కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో లేదా 95730 21035, 77025 16674 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేరాల్లో పాలుపంచుకున్న వారికి బైండోవర్




తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

కేశంపేట: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వివిధ నేరాల్లో పాలుపంచుకున్న వ్యక్తులను మంగళవారం తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ నరహరి తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ముందు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామన్నారు. మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన భానుచందర్, కేశంపేటకు చెందిన జంగయ్య, మహేశ్, ఎల్లస్వామి, నిర్దవెల్లికి చెందిన నర్సింహాచారిని బైండోవర్ చేశారు.

బిల్లులు విధిగా ఇవ్వాలి

రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి ఉష



ఆమనగల్లులోని ఓ ఫర్టిలైజర్ షాపులో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఉష

ఆమనగల్లు: ఫర్టిలైజర్ షాపుల్లో విక్రయించే విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన బిల్లులను రైతులకు విధిగా ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి ఉష ఆదేశించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు షాపు ముందు ప్రదర్శించాలని అన్నారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ షాపుల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు విక్రయించాలని తెలిపారు. ప్రతిషాపులో విధిగా స్టాకు రిజిస్టర్ మెయింటెన్ చేయాలని, ఎప్పటికప్పుడు వివరాలు పొందుపర్చాలని చెప్పారు. మందులు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆమనగల్లు ఏడీఏ శోభారాణి, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



అలుగు సైడ్‌వాల్ పైనుంచి బైక్‌ను దాటిస్తున్న వాహనదారులు



గుండ్లు తేలి, గుంతలమయమైన కల్వర్టును దాటేందుకు ప్రయాణికుల పాట్లు

రోడ్డు దాటే ఆరాటం.. ప్రాణాలతో చెలగాటం

కోట్‌పల్లి అలుగు వద్ద ప్రమాదకరంగా రాకపోకలు

- సర్కస్ ఫీట్లు చేస్తూ వెళ్తున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ధారూరు: రుద్రారం- నాగసమందర్ గ్రామాల మధ్య కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు ప్రవహించే లోలెవల్ వంతెన వద్ద రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారులు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. బ్రిడ్జి మధ్య వేసిన మట్టి రోడ్డు వరద ఉధృతికి పూర్తిగా ధ్వంసమైంది. రెండుసార్లు తాత్కాలిక మరమ్మతులు చేసినా వరద పాలైంది. దీంతో గత సెప్టెంబర్ 26 నుంచి ఈమార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ధారూరు నుంచి నాగసమందర్, పెద్దేముల్, కోట్‌పల్లి, బంట్వారంతో పాటు కర్ణాటకలోని కుంచారం వెళ్లడానికి ఇదే ప్రధాన దారి. మరోమార్గంలో వెళ్లాలంటే సుమారు 60 కిలోమీటర్లు అదనంగా తిరగాల్సిందే. దీంతో కొంతమంది వాహనాదారులు గుండ్లు తేలి, గుంతలమయమైన రోడ్డుతో పాటు కల్వర్టు కొట్టుకుపోగా ఇరువైపులా మిగిలిన సైడ్‌వాల్స్ పైనుంచి మంగళవారం సర్కస్ ఫీట్లు చేస్తూ వెళ్తున్నారు. గోడలపై తేలిన ఇనుప చువ్వలను దాటేందుకు బైక్‌లను పైకి ఎత్తుతున్నారు. ఈ సమయంలో కాస్త అటు ఇటు అయినా ఉధృతంగా ప్రవహిస్తున్న పడి ప్రాణాలు కోల్పోవాల్సిందే. సంబంధిత అధికారులు అలుగు మరమ్మతులను పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరగకుండా నివారించాల్సిన పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఆలస్యానికి.. నిరీక్షణ శిక్ష!

- నాలుగు గంటల పాటు లోనికి అనుమతించని ప్రిన్సిపాల్
- గురుకుల పాఠశాల గేటు వద్దే తల్లిదండ్రులు, విద్యార్థుల పడిగాపులు



పాఠశాల గేటు ఎదుట విద్యార్థుల పడిగాపులు

కొడంగల్: దసరా సెలవుల సందర్భంగా ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు రెండు రోజులు ఆలస్యంగా వచ్చారని ఆగ్రహించిన ప్రిన్సిపాల్ వారిని నాలుగు గంటల పాటు గేటు వద్దే నిరీక్షించేలా చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దౌల్తాబాద్ బీసీ గురుకుల పాఠశాలను కొడంగల్ మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామ శివారులోని ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. దసరా సెలవుల అనంతరం గత 4న శనివారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. అయితే మరునాడు ఆదివారం కావడంతో కొంతమంది విద్యార్థులు సోమవారం, మరికొంత మంది మంగళవారం హాస్టల్‌కు వచ్చారు. ఉదయం 8కి వచ్చిన విద్యార్థులను మధ్యాహ్నం 12 గంటల వరకు గేటు బయటే ఎండలో నిలబెట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక పాత్రికేయులు పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశం మేరకే పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు. ఆతర్వాత గేటు తీయించి లోపలికి అనుమతించారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బ్యాంకు అకౌంట్, ఆధార్ అప్‌డేట్ చేయించడం కోసం ఆలస్యమైందని విద్యార్థులు, వ్యవసాయ పనులు ఉన్నాయని తల్లిదండ్రులు వివరించినా ప్రిన్సిపల్ వినలేదన్నారు. ఇదిలా ఉండగా హాస్టల్‌లో పనిచేస్తున్న పర్మినెంట్ ఉపాధ్యాయులు.. విద్యార్థులతో పాటు గెస్ట్ ఫ్యాకల్టీపై పని భారం మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపించారు.

కార్యదర్శులకు స్థానచలనం!



తాండూరు రూరల్: గ్రామ పాలనలో ముఖ్య భూమిక పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శుల బదిలీలు మళ్లీ రాజకీయ రంగు పులుముకున్నాయి. గతంలో అధికార కాంగ్రెస్‌లో గ్రామస్థాయి నాయకులు తమ మాట వినని పంచాయతీ కార్యదర్శులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేసి బదిలీ చేయించారు. తమకు అనుకూలంగా ఉన్న వారిని గ్రామాలకు రప్పించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మండల పరిధిలో పలువురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇందుకు సంబంధించిన ఆర్డర్ కాపీలు సైతం అధికారుల చేతికి వచ్చినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వీరిని రిలీవ్ చేయలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు మాత్రం అవి బదిలీలు కావని.. డిప్యూటేషన్ అంటూ ప్రచారం చేయాలని అధికారులకు సూచిస్తున్నట్లు సమాచారం. కాగా సదరు ఎంపీడీఓ మాత్రం ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా తాను పని చేయాలేనని తేల్చిచెప్పారని ప్రచారం సాగుతోంది. బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు తీర్పు ఆధారంగా స్థానచలనం ఉండొచ్చని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

పాపం.. పత్తి రైతు

ఎడతెరిపిలేని వర్షాలకు పాడైన పంట

- ఎండాకు తెగులు సోకడంతో భారీగా నష్టం
- ఆందోళనలో రైతులు



మొరంగపల్లిలో ఎండాకు తెగులు సోకిన పత్తి పంట

మోమిన్‌పేట: వానాకాలం సీజన్‌లో తెల్ల బంగారం సాగు చేసిన రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పత్తి సాగుకు అనుకూలమైన వాతవరణం లేక కాపు తక్కువగా కాసింది. ఎడ తెరిపి లేని వర్షాల కారణంగా కాపు కనుమరుగైంది. దీనికి తోడు పంటకు తెగులు సోకడంతో పెట్టుబడులు సైతం వచ్చేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్‌లో కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.8,120 మద్దతు ధర ప్రకటించడంతో ఉత్సాహంగా సాగుకు సన్నద్ధమైన రైతన్న ఇప్పుడు దిగాలు చెందుతున్నాడు. జూన్‌లో సరిపడా వర్షాలు కురవక జూలైలో పత్తి విత్తనాలు విత్తుకున్నారు. మొలకలున్నప్పుడే నెల రోజులపాటు వర్షాలు దంచి కొట్టాయి. దీంతో మొలకల ఎదుగుదల నిలిచిపోయింది. అల్ప పీడన ప్రభావంతో తరచూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుత వర్షాలకు పంటలు పూర్తిగా చేతికందేలా లేవని ఆందోళన పడుతున్నారు. ఈ ఏడాది పెట్టుబడులు విపరీతమయ్యామని పత్తి సాగు చేసిన రైతులకు కష్టాలు తప్పేలా లేవని వాపోతున్నారు.

ఎకరాకు రూ.30వేల పెట్టుబడి

మండలంలోని ఆయా గ్రామాలలో రైతులు 80 శాతం పత్తిని సాగు చేపట్టారు. అడవి పందుల బెడద కారణంగా మొక్కజొన్న సాగు తగ్గింది. సుమారుగా 18వేల ఎకరాలలో పత్తిని సాగు చేశారు. ఆశించిన స్థాయిలో పంట ఎదుగుదల లేకపోవడం, తెగులు సోకడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు రూ.30వేలకు పైగానే పెట్టుబడులు పెట్టినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరెకరాలు కౌలుకు తీసుకున్నా



ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. మూడు నెలలుగా కుస్తున్న వర్షాలకు పంట ఎదగలేదు. కౌలుతో కలుపుకొని రూ.2లక్షలకు పైగానే పెట్టుబడి పెట్టా. పది కాయలకు మించి కాయలేదు. ఆశించిన స్థాయిలో ఎదుగుదల లేకపోవడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. – ఆనందం, కౌలు రైతు, ఎన్కేపల్లి

అక్రమ కట్టడాన్ని అడ్డుకోవాలి

ఐనాపూర్ పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తుల వినతి

దోమ: కొందరు వ్యక్తులు దారిని అక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని.. ఈ అక్రమ కట్టడాన్ని అధికారులు అడ్డుకోవాలి ఐనాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. 30 ఏళ్లగా గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లేందుకు కాలిబాట ఉంది. ఈ మార్గాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తున్నారని వివరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కట్టడాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నర్సింలు, నర్సమ్మ, అనంతమ్మ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రికార్డ్స్ దగ్ధం

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలోని ఓ గదిలో భద్రపరిచిన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన స్కాలర్‌షిప్ మాన్యువల్ ఆన్‌లైన్‌స్పైరల్ బాండింగ్ హార్డ్ కాపీస్ మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. 1982 నుంచి 2015 వరకు సంబంధించిన హార్డ్ కాపీస్, ఫైల్స్ మైసిగండి ఆశ్రమ పాఠశాలలోని ఓ గదిలో భద్ర పర్చారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ప్రమాదవశాత్తు గదిలో భద్ర పరిచిన రికార్డులు దగ్గమయ్యాయి. గమనించిన పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గంగాధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వసతిగృహ సంక్షేమాధికారి బాలరాజు ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గంగాధర్ తెలిపారు.

ఇద్దరు యువకులకు రిమాండ్

పహాడీషరీఫ్: గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను బాలాపూర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎం.సుధాకర్ తెలిపిన ప్రకారం.. బిసా క్రొమ్రీ అలియాస్ చింటూ(19), కొక్కిలిగడ్డ హారూన్ అలియాస్ అరుణ్(20), ఒడిశాకు చెందిన అర్జున్ బైక్‌పై శివాజీచౌక్ మీదుగా ప్రయాణిస్తున్నారు. ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు వారిని తనిఖీ చేయగా 4.04 కిలోల గంజాయి లభ్యమైంది. అర్జున్ పరారీకాగా.. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తాండూరును హస్తగతం చేసుకుంటాం



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ వ్యవస్థ ప్రారంభం నాటి నుంచి తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురలేదని.. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలాన్ని హస్తగతం చేసుకుంటామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో చెన్‌గేస్‌పూర్, కోనాపూర్ గ్రామల నుంచి 200 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరులో జెడ్పీటీసీగా గెలిచే వారికే అవకాశం కల్పిస్తున్నామన్నారు. 15 ఎంపీటీసీ స్థానాల్లోనూ బలమైన అభ్యర్థులను నిలుపుతామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్శితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు. చెన్‌గేస్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్ గౌడ్ తదితరులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు .ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయకులు వేణు, శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, భీంసేన్, గుండప్ప ముదిరాజ్, రాములు, నరేష్ ముదిరాజ్, రాములమ్మ, రాములు తదితరులు ఉన్నారు.

వెల్‌డన్ ఆదిత్య

తాండూరు టౌన్: ప్రభుత్వ గురుకులాల్లో ప్రైవేటుకు దీటుగా బోధన అందుతోందనడానికి ఆదిత్యవర్ధన్ మంచి ఉదాహరణ అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివి టాప్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. యాలాల మండలం బండమీదిపల్లికి చెందిన నర్సింలు, పద్మ దంపతుల కుమారుడు ఆదిత్యవర్ధన్ నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి, హైదరాబాద్‌లోని కామినేని మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. మంగళవారం తనను కలిసిన విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేతో పాటు ఉన్న సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్, ధారాసింగ్, పి.నర్సింలు, చందర్ ఉదయ్ భాస్కర్, మురళీకృష్ణ గౌడ్, మాధవరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు అభినందించారు.



తాండూరు టౌన్: విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే బీఎమ్మార్


దసారా

తండాల్లో మళ్లీ గుప్పుమంటున్న గుడుంబా

- పండుగ సమయంలో భారీగా విక్రయాలు!
- రహస్య స్థావరాల్లో సారా కాస్తున్న గిరిజనం
- ఎక్సైజ్ శాఖ తనిఖీల్లో భారీగా పట్టుబడుతున్న ముడిసరుకు



మంచాల అటవీ ప్రాంతంలో బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)



కొర్ర తండాలో డ్రముల్లో పట్టుబడిన బెల్లం పానకం నిల్వలు (ఫైల్)

యాచారం: కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. కొన్నాళ్లుగా వాసన లేని నాటు సారా తండాల్లో విచ్చలవిడిగా తయారీ అవుతుండడంతో ఎక్సైజ్ శాఖలో కలవరం మొదలైంది. గతంలో యాచారం, మంచాల, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, కందుకూరు మండలాల పరిధిలోని గిరిజన తండాల్లో వేలాది లీటర్ల నాటు సారా విచ్చలవిడిగా లభ్యమయ్యేది. తయారీ, అమ్మకంతో వందలాది మంది గిరిజనులతో పాటు ఆయా గ్రామాల్లోని వ్యాపారులు జీవనోపాధి పొందేవారు. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం, పాలక ప్రభుత్వాల ఆర్థిక ప్రోత్సాహంతో సారా తయారీ నిర్మూలన దశకు వెళ్లింది. ఎక్సైజ్ శాఖ పోలీసులు మెరుపు దాడులతో కేసుల నమోదుతో ఆయా మండలాల్లోని గిరిజనులు జైలుపాలు అయ్యారు. చదువులు, ఉద్యోగాల సాధనపై గిరిజన యువతలో మార్పులు రావడంతో సారా కట్టడి చేశారు. ప్రజల్లోనూ ఆర్థిక వనరులు మెరుగవడంతో తాగడానికి నిరాసక్తత చూపారు.

వేలాది కిలోల ముడిసరుకు విక్రయం

తండాల్లో కొన్ని నెలలుగా నాటు సారా తయారీ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. యాచారం మండలం నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, నందివనపర్తి, కొత్తపల్లి, అయ్యవారిగూడెం గ్రామాల్లోని తండాలు, మంచాల మండలంలోని బోడకొండ, ఎల్లమ్మతండా, సత్తితండా, లోయపల్లి గ్రామాల తండాల్లో, కడ్తాల్ మండలం పల్లెచల్కతండా, మాడ్గుల మండలం గుడితండా, వెంకటేశ్వరతండా, ఆమనగల్లు మండలాల్లోని పలు తండాల్లో సారా బట్టీలు పెరిగాయి. మద్యం ధరలు అమాంతం పెరగడం, రూ.150 ఖర్చు చేస్తే లీటరుకు పైగా దొరుకుతుండడంతో నిరుపేదలు మళ్లీ సారా తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎక్సైజ్ పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బెల్లం, పటిక ఇతర ముడిసరుకులను మాల్, కడ్తాల్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, ఆరుట్ల, మంచాల, యాచారం కేంద్రాల్లోని వ్యాపార దుకాణాల్లో వేలాది కిలోల చొప్పున విక్రయాలు చేసినట్లు తెలుస్తోంది.

రహస్య స్థావరాల్లో డంప్‌లు

బోనాలు, దసరా పండుగలకు గ్రామాల్లో జోరుగా సారా అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఆయా తండాల్లోని గిరిజనులు వ్యవసాయబావులు, అటవీప్రాంతాల్లోని రహస్య ప్రాంతాల్లో డంప్‌లు ఏర్పాటు చేసుకుని తయారీ చేసి విక్రయించినట్లు తెలుస్తోంది. దసరాకు ముందే ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీసులు యాచారం, మంచాల మండలంలోని పలు తండాల్లో దాడులు చేపట్టి వేలాది లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. కల్లు దుకాణాలు, మాల్, యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల, ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్ మండల కేంద్రాల్లోనూ నాటు సారా అమ్మకాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధి లేకే..



తండాల్లో నాటుసారా తయారు కాకుండా సర్కారే దృష్టి సారించాలి. అక్కడక్కడ మళ్లీ సారా తయారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. వారిని గుర్తించి జీవనోపాధికి కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చాలి. గొర్రెలు, మేకలు, చిరు వ్యాపారాల కోసం బ్యాంకు రుణాలు ఇప్పించాలి. ఉపాధి లేక కొందరు మళ్లీ సారా తయారీపై దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.

– కొర్ర అరవింద్‌నాయక్, మంతన్‌గౌరెల్లి

కఠిన చర్యలు



పలు తండాల్లో మళ్లీ సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం ఉంది. దసరా పండుగకు ముందు దాడులు చేపట్టి వేలాది లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశాం. గట్టి నిఘా ఏర్పాటు చేశాం. తయారీదారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవు.

– సీతారాంరెడ్డి, ఎక్సైజ్ శాఖ సీఐ, ఇబ్రహీంపట్నం డివిజన్

ప్రభుత్వ భూములు కాపాడండి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం

చేవెళ్ల: పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించిన ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని న్యాలట గ్రామంలో ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. న్యాలట రెవెన్యూలోని సర్వే నెంబర్ 240లోని ప్రభుత్వ భూములను, పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూములను కొందరు కబ్జాదారులు, రాజకీయ నాయకులు కబ్జా చేసి విక్రయాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి కబ్జాకు గురవుతున్న భూములను కాపాడాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు మక్బూల్, సుధాకర్‌గౌడ్, శివ, కిష్టయ్య, అంజయ్య, సుదర్శన్ తదితరులు ఉన్నారు.